క్లుప్తంగా

బాధితుడిని పరామర్శించిన ఎమ్మెల్యే



వెల్దండ: మండలంలోని తిమ్మినోనిపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రామచంద్రారెడ్డి అనారోగ్యానికి గురై హైదరాబాదులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బుధవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆయనను పరామర్శించి ఆరోగ్య సమస్యను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలను అందించాలని వైద్యులకు సూచించారు. ఆయన వెంట సురేందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఏఎన్‌ఎం పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

వెల్దండ: మండల కేంద్రంలో ఆదర్శ మోడల్ స్కూల్‌లోని వసతి గృహంలో ఏఎన్ఎంగా విధులు నిర్వహించడానికి దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంఈఓ చంద్రుడు బుధవారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన వారై ఉండాలని, ఆసక్తిగల మహిళలు ఇంటర్మీడియట్‌తో పాటు నర్సింగ్ శిక్షణ పూర్తి చేసుకోని ఉండాలన్నారు. ఈనెల 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వంగూరు: మండలంలోని డిండిచింతపల్లి వాగునుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం రంగాపూర్ గ్రామం వద్ద పోలీసులు పట్టుకున్నారు. డ్రైవర్‌తో పాటు ట్రాక్టర్ యజమానిపై కేసు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

మన్ననూర్: అమ్రాబాద్ మండలం తెలుగుపల్లి గ్రామానికి చెందిన కొప్పెరి అంజి స్థానిక అంబేడ్కర్ కాలనీ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సంఘటన చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. అమ్రాబాద్ వైపు నుంచి బైక్‌పై అంజి వెళ్తుండగా, రోడ్డుపై పశువులను తప్పించబోయి ముందు వెళ్తున్న బొలోరాను ఢీకొట్టాడు. దీంతో అతని ఎడమ చేయి పూర్తిగా విరిగి తీవ్ర గాయాలయ్యాయి.

హత్యకేసులో నిందితులను అరెస్టు చేయాలి

కొల్లాపూర్: చిన్నంబావి మండలం లక్ష్మీపల్లి గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు బొడ్డు శ్రీధర్ రెడ్డి హత్య ఘటనలో నిందితులను గుర్తించి అరెస్టు చేయాలని బీఆర్ఎస్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు దేవని కుమార్ మాదిగ కోరారు. హత్య జరిగి దాదాపుగా 5 నెలలు కావస్తున్నా నిందితులను పట్టుకోకపోవడం దారుణమన్నారు. రాజకీయ ప్రోద్బలంతోనే శ్రీధర్‌రెడ్డి హత్య జరిగిందని ఆయన ఆరోపించారు. నిందితులను అరెస్టు చేయకుంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామన్నారు.

గడపగడపకు అమ్మవారి కుంకుమ, గాజులు

బిజినేపల్లి: మండలంలోని వెల్గొండ గ్రామానికి చెందిన దుర్గామాత అమ్మవారి ఉత్సవ కమిటీ సభ్యులు బుధవారం గ్రామంలోని గడప గడపకు అమ్మవారి కుంకుమ, గాజులు పంపిణీ చేశారు. అమ్మవారి ఆశీస్సులు గ్రామంలోని ప్రతి ఇంటికి ఉండాలనే సంకల్పంతోనే ఈ కార్యక్రమం వినూత్నంగా చేపట్టినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

విద్యార్థులకు స్టడీమెటీరియల్ పంపిణీ



తాడూరు: మండలంలోని ఐతోల్‌లో బుధవారం పూజారి హరికృష్ణ రూ.11 వేల విలువైన టెస్ట్ పేపర్స్, స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. 10వ తరగతి విద్యార్థులు బాగా చదువుకొని గ్రామంలో ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని తన వంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎం భాస్కర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

హమాలీ యూనియన్ జిల్లా కమిటీ ఎన్నిక

నాగర్‌కర్నూల్‌రూరల్: నాగర్‌కర్నూల్ హమాలీ యూనియన్ జిల్లా కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా రాధాకృష్ణ, ఉపాధ్యక్షులుగా బురాన్, మల్లయ్య, బాలయ్య, కార్యదర్శిగా ఈశ్వర్, సహాయ కార్యదర్శిగా ఆంజనేయులు, వెంకటస్వామి, సత్తయ్య తదితరులు ఎంపికయ్యారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- రూ.3.5 కోట్లతో వసతి గృహం నిర్మిస్తాం
- ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ



కొండనాగులలో గ్రామ పంచాయతీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట రూరల్/బల్మూర్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. మండలంలోని కొండనాగుల లో రూ.25లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులు, రూ. 10లక్షల తన సొంత నిధులతో ముస్లిం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు.

గ్రామంలోని బీసీ బాలుర వసతి గృహంలో గదులు, పైకప్పు పెచ్చులూడడంతో రెండేళ్ల నుంచి అద్దె భవనంలో కొనసాగుతోంది. ఈ విషయం స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించి శిథిలావస్థలో ఉన్న వసతి గృహాన్ని పరిశీలించారు. 40 ఏళ్ల నాటి బీసీ బాలుర వసతి గృహాన్ని కూల్చేసి నూతనంగా రూ.3.5కోట్లతో నిర్మిస్తామని ఎమ్మెల్యే ప్రకటించారు. ఏఈ కోటేశ్వర్‌రావుతో ఫోన్ తో మాట్లాడి వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ రాఘవులు, ఏఈ శ్రీనివాసులు, కార్యదర్శి మధుమోహన్, మాజీ ఎంపీపీ వేనేపల్లి అరుణ, మండల అధ్యక్షులు వెంకట్‌రెడ్డి, కాశన్నయాదవ్ పాల్గొన్నారు.

ఆపన్న'హస్త'ంగా ఉంటాం

ఆపదలో ఉన్న వారిని ఆప్తులు గా అక్కున చేర్చుకుంటామని, వారికి ఆపన్నహస్తంగా ఉంటామని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. అచ్చంపేటలో పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు.

రహదారులకు మహర్దశ తీసుకొస్తాం

- ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి

నాగర్‌కర్నూల్/నాగర్‌కర్నూల్ రూరల్: నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని నాగనూల్‌లో రూ.6.70 లక్షలతో నిర్మించే రహదారి పనులను బుధవారం ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ గ్రామాల్లో రహదారులకు మహర్దశ తీసుకొస్తామన్నారు. రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం ని ధులు మంజూరు చేసిందన్నారు. నెల్లికొండ రోడ్డుకు రూ.2 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు, జ్యోతి, సుల్తాన్, కావలి శ్రీను, నర్సింహారెడ్డి, కృష్ణారెడ్డి, శాంతయ్య, సంతోష్ పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా చెక్కుల పంపిణీ

నియోజకవర్గంలో రాజకీయాలకు అతీతంగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందిస్తామని ఎమ్మెల్యే అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణ, మండల పరిధిలోని పలువురు లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.

నాణ్యమైన భోజనంపై దృష్టి పెట్టాలి

బిజినేపల్లి: ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి సూచించారు. మండలంలోని నందివడ్డెమాన్‌లోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యార్థులు అందించే భోజనాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామంలో శంకర నేత్రాలయ కంటి వైద్యశాల చెన్నై ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుదర్శన్‌గౌడు, నాయకులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ స్కూల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

తాడూరు: మండల కేంద్రంలో డ్రైవింగ్ స్కూల్‌ను ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన యువతీయువకులకు, కొత్తగా డ్రైవింగ్ నేర్చుకునే వారికి నియమనిబంధనలు తెలియజేయాలన్నారు. ఆయన వెంట సింగిల్‌విండో చైర్మన్ రామచంద్రారెడ్డి, నాయకులు ఉన్నారు.

ప్రభుత్వ నిబంధనలు పాటించాలి



జిల్లా కేంద్రంలో మెడికల్ దుకాణంలో తనిఖీ చేస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ విశ్వత్ రెడ్డి

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా మెడికల్ షాపులు నిర్వహించాలని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ విశ్వత్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పలు మెడికల్ దుకాణాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రభుత్వ అనుమతి ఉన్న మందులను మాత్రమే మెడికల్ దుకాణాల్లో విక్రయించాలని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే మెడికల్ దుకాణాల లైసెన్స్‌లు రద్దు చేస్తామన్నారు. మెడికల్ దుకాణాల్లో నాణ్యతలేని మందులు విక్రయిస్తే ఔషధ నియంత్రణ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఉప్పునుంతల: ప్రభుత్వం లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీంను తీసుకొచ్చినందున 2020 ఆగస్టు 26వ తేదీకి ముందు అనుమతిలేని లే అవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి ఇంతకుముందు ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తులు చేసుకున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీఓ నారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వెల్టూరు, ఉప్పునుంతల, కాంసానిపల్లి, మామిళ్లపల్లి, ఫిరట్వానిపల్లి, రాయిచేడ్, అయ్యవారిపల్లి గ్రామాల్లో చేసిన అనధికార లే అవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు గతంలో ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిపారు. వారు సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శిని కలిసి ప్లాట్ డాక్యుమెంట్లు, ఈసీలు, ఇతర అవసరమైన పత్రాలు చూపించి నిర్దేశించిన గడువులోపు ప్లాట్‌ను రెగ్యులరైజేషన్ చేయించుకోవాలని ఎంపీఓ సూచించారు.

విద్యార్థినులకు చట్టాలపై అవగాహన



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న డివిజన్ అధికారి వెంకటస్వామి

వెల్దండ: విద్యార్థినులు, మహిళలు వేధింపులకు గురైతే ధైర్యంగా షీ టీంకు ఫిర్యాదు చేయాలని కల్వకుర్తి డివిజన్ షీ టీం ఇన్‌చార్జి వెంకటస్వామి తెలిపారు. బుధవారం వెల్దండ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో షీ టీంపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రధానంగా షీ టీం బృందాలు కూడలి, బస్‌స్టాండ్, ప్రజలు ఎక్కువగా ఉన్న చోట ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. వేధింపులకు గురైన వారు 100గాని, షీ టీం ప్రత్యేక ఫోన్‌నెంబర్లకు సమాచారం ఇస్తే వెంటనే పోలీస్ బృందం అందుబాటులో ఉంటుందన్నారు. అనంతరం షీ టీం చట్టాలపై వారికి వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ గోపాల్‌రావు, ఎస్ఎస్ఎస్ పీఓ శివప్రసాద్, విజయలక్ష్మి, వీణా, అంజమ్మ, రమేష్, షణ్ముఖరెడ్డి, నవీన్, శివశంకర్, భరత్, హుస్సేన్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో ధర్నా



నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయం ముందు బీఎస్పీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్పీ జిల్లా అధ్యక్షులు బోనాసి రామచందర్ మాట్లాడుతూ ఈ నెల 7న మున్సిపాలిటీ అవినీతిపై విచారణ నిర్వహించి దోషులను తేల్చినా ఇప్పటికి వారిపై చర్యలు తీసుకోలేదని, తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పృథ్వీరాజు, కల్యాణ్, నాగేష్, బాలనాగయ్య, నాగరాజు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎఫ్ఆర్సీ కమిటీ అధ్యక్షులు హన్మంతు

లింగాల: నల్లమల అటవీ ప్రాంతంలో గిరిజనులకు న్యాయం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 2006లో తీసుకొచ్చిన అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయాలని ఎఫ్ఆర్సీ కమిటీ అధ్యక్షులు హన్మంత్ ప్రభుత్వాన్ని కోరారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం లింగాల, పెద్దకొత్తపల్లి, కొల్లాపూర్ మండలాలకు చెందిన ఎఫ్ఆర్సీ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మూడు మండలాలకు సంబంధించిన 14 గ్రామాల చెంచులు, బంజారాలు, ఇతర వర్గాల వారు అటవీ ప్రాంతానికి వెళ్లలేని పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మేత కోసం పశువులను, మేకలు, గొర్రెలను అటవీ శాఖ వారు అడవుల్లోకి అనుమతించడం లేదన్నారు. అటవీ హక్కు చట్టం ప్రకారం అడవిలో కొంత ప్రాంతాన్ని మేతకు కేటాయించాల్సి ఉండగా అది అమలు కావడం లేదన్నారు. చట్టం అమలు కోసం కార్యాచరణ రూపొందించి ముందుకు పోతామన్నారు. సమావేశంలో ఆయా మండలాలకు చెందిన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పలక, బలపం వదిలి.. పలుగు, పార పట్టి



పదరలోని బీసీ బాలుర వసతి గృహ విద్యార్థులతో నిర్వాహకులు బలవంతంగా కాయ కష్టం చేయిస్తున్నారు. బుధవారం వసతి గృహంలో అస్తవ్యస్తంగా ఉన్న పరిసరాలను సరిచేసేందుకు అవసరమైన మొరం (మట్టి) ట్రాక్టర్లతో గేటు ముందు వేయించడంతోపాటు తట్ట, పార పనులు చేయించడం గమనార్హం. ఈ ఘటనపై విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. పలక, బలపం పట్టి అక్షరాలు దిద్దించాల్సిన వారితో.. పలుగు పార పట్టించి కూలీ పనులు చేయించడం ఏమిటని మండిపడుతున్నారు. – మన్ననూర్

నూతన ఉపాధ్యాయులకు శిక్షణ



శిక్షణకు హాజరైన నూతన ఉపాధ్యాయులతో ఎంఈఓ, కాంప్లెక్స్ హెచ్ఎం

లింగాల: మండలంలో నూతనంగా విధుల్లో చేరిన 28 మంది ఉపాధ్యాయులకు బుధవారం ఎమ్మార్సీ ఆవరణలో ఒక రోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ బషీర్ అహ్మద్ నూతన ఉపాధ్యాయులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. పాఠశాల విధులు, రికార్డుల నిర్వహణ పట్ల తగు జాగ్రత్తగా ఉండాలని, సమయపాలన పాటిస్తూ సక్రమంగా విధులను నిర్వర్తిస్తూ అంకితభావంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో అంబట్‌పల్లి కాంప్లెక్స్ హెచ్ఎం జ్యోతిరాణి, ఎమ్మార్సీ సిబ్బంది సాయికిరణ్, శ్రీను, హరిలాల్, ఆర్పీ శివప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బందిని నియమించాలి

కోడేరు: మండల కేంద్రంలో విద్యుత్ సిబ్బంది కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సీపీఎం గ్రామ కార్యదర్శి రవి, రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ముగ్గురు విద్యుత్ సిబ్బంది పని చేయాల్సినప్పటికీ ఒక జేఎల్ఎంతో పని చేస్తున్నారని, దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ సిబ్బందిని నియమించాలని కోరారు.

విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

కోడేరు: ఉపాధ్యాయులు విధులపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కాంప్లెక్స్ హెచ్ఎం ఆంజనేయులు హెచ్చరించారు. బుధవారం మండలంలోని నర్సాయిపల్లి, ఎత్తం, కొండ్రావుపల్లి పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఎస్ఏ–1 పరీక్షలు నిర్వహించాలని ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో విద్యార్థుల హాజరు శాతాన్ని నమోదు చేయాలన్నారు. అనంతరం విద్యార్థుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో సీఆర్పీ సాయికుమార్, ఉపాధ్యాయులు వెంకట్‌రాములు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా విద్యుత్ సిబ్బంది విధుల్లోకి..



తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో విద్యుత్ సిబ్బంది బదిలీపై వెళ్లడంతో వారి స్థానాల్లో కొత్త సిబ్బంది బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఏఈ శ్రీరాములు ఆధ్వర్యంలో లైన్ ఇన్‌స్పెక్టర్‌గా బి శ్రీనివాసులు, శిర్సవాడ లైన్‌మేన్‌గా పి శ్రీను, తుమ్మలసూర్ లైన్‌మేన్‌గా ఈ శ్రీనివాసులు, ఐతోల్ లైన్‌మేన్‌గా గణేష్, తాడూరు లైన్‌మెన్‌గా బొజ్జన్న పదవీ బాధ్యతలు చేపట్టారు.

లింగాల ఎస్ఐగా..

లింగాల: ఎస్ఐగా ఎ.నాగరాజు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ 6 నెలలుగా పనిచేసిన ఎస్ఐ జగన్‌మోహన్‌ను వనపర్తి ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేశారు. మహబూబ్‌నగర్ నుంచి బదిలీపై నాగరాజు ఇక్కడికి వచ్చారు. విధుల్లో చేరిన ఆయనను సహచర సిబ్బంది ఘనంగా సన్మానించారు.

ఎస్ఐ వెంకట్‌రెడ్డికి సన్మానం



ఉప్పునుంతల: మండలంలో ఇటీవల నూతనంగా బాధ్యతలు తీసుకున్న ఎస్ఐ వెంకట్‌రెడ్డిని కాంగ్రెస్ సీనియర్ నాయకులు తిప్పర్తి నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో లింగమయ్య, తిప్పర్తి ప్రశాంత్‌రెడ్డి, సూరం ప్రశాంత్‌రెడ్డి, నందాచారి ఉన్నారు.

చారకొండ ఎస్ఐకి..

చారకొండ: చారకొండ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ శంషోద్దీన్‌ను కాంగ్రెస్ మండల నాయకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు బాల్‌రాం గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకట్ గౌడ్, డీసీసీ ఉపాధ్యక్షులు వెంకటయ్య యాదవ్, మాజీ ఎంపీటీసీ లక్ష్మణ్, నాయకులు ఉన్నారు.

మార్చాలలో అధికారులకు..



కల్వకుర్తిరూరల్: మండలంలోని మార్చాలలో విద్యుత్ లైన్‌మెన్ కృష్ణ బదిలీపై వెళ్లగా, ఆ స్థానంలో వచ్చిన మగ్బూల్‌ను, పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు తీసుకున్న ఎలీషాలను బుధవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులు వేర్వేరుగా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇరు పార్టీల నాయకుల పాల్గొన్నారు.

మండల విద్యాధికారికి..

లింగాల: మండల విద్యాధికారిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన బషీర్ అహ్మద్‌ను ఎమ్మార్సీ ఆవరణలో మండల యువజన కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలపై తమ దృష్టికి తీసుకొస్తే ఎమ్మెల్యేకు తెలిజేసి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎంఈఓ తెలిపారు.

వక్ఫ్ ప్రొటెక్షన్‌సెల్ సభ్యుడికి..



నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలోని వక్ఫ్ కార్యాలయం వద్ద బుధవారం జిల్లా వక్ఫ్ ప్రొటెక్షన్‌సెల్ సభ్యుడు వసియోద్దీన్‌ను మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు అబీబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణ సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారని జిల్లా కమిటీలో మంచి స్థానం కలిపించి ప్రజాప్రతినిధులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు అబీబ్‌ఖాన్, సాదిక్‌పాషా, కౌన్సిలర్ నిజాం, మహమ్మద్‌గౌస్, శేక్‌వాలీ, ఇంథియాజ్, సలీం, ఫహీం, సుల్తాన్, అయూబ్‌ఖాన్ పాల్గొన్నారు.

గత ప్రభుత్వంలోనే అక్రమ కేసులు

అచ్చంపేట రూరల్: గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే కాంగ్రెస్ నాయకుల మీద అక్రమ కేసులు పెట్టిన చరిత్ర ఉందని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు రామావత్ సంతోష్ అన్నారు. బుధవారం అచ్చంపేటలో ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అరాచకాలు చేసినందుకే నియోజకవర్గ ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. ఆయన ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో రేణయ్య, యశ్వంత్, లడ్డుయాదవ్, మహేష్‌యాదవ్, హరి, దశరథ్, శివ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై ఆరోపణలు చేస్తే సహించేదిలేదు

మన్ననూర్: ఈ ప్రాంత వాసిగా అచ్చంపేట నియోజకవర్గం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని డీసీసీ కార్యదర్శులు సంబు వెంకటరమణ, పంబలి బుచ్చయ్య, మండల మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఎంఏ రహీం, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ హన్మంత్‌రెడ్డి హెచ్చరించారు. చేతనైతే నియోజకవర్గం అభివృద్ధి కోసం సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన నేతలు



వంగూరు: పీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్‌ను బుధవారం వంగూరు మండల కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లో కలిశారు. మండలానికి చెందిన కేవీఎన్‌రెడ్డిని వ్యవసాయ కమిషన్ సభ్యుడిగా నియమించినందుకు పీసీసీ అధ్యక్షుడికి అభినందనలు తెలిపారు. కలిసిన వారిలో కేవీఎన్ రెడ్డి, పాండురంగారెడ్డి, తదితరులు ఉన్నారు.

29 జీఓ పత్రాల దహనం



అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రభుత్వం విడుదల చేసిన 29 జీఓ నెంబర్ కాపీలను బుధవారం ఉద్యోగ సంఘాల నాయకులు అంబేడ్కర్ చౌరస్తా వద్ద కాల్చివేశారు. ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ జీఓ ద్వారా బీసీలకు, బహుజనులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. ఈడబ్ల్యూఎస్ పేరుతో జీఓ 29 భవిష్యత్‌లో జరిగే రిక్రూట్‌మెంట్లలో ఉద్యోగాలు దక్కే అవకాశం లేదన్నారు. గతంలో ఉన్న 55 జీఓ ప్రకారం ఉద్యోగాల రిక్రూట్‌మెంట్ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు గుడిపల్లి నిరంజన్, కొంగరి జానయ్య, సోమశిల సురేష్, ఈశ్వర్, లక్ష్మణ్ నాయక్, బాలరాజు, తిరుపతయ్య, నారాయణ పాల్గొన్నారు.

పశువుల రక్త నమూనాల సేకరణ



పశువుల నుంచి రక్త నమూనాలు సేకరిస్తున్న పశువైద్య అధికారులు

చారకొండ: పశువులకు టీకాలకు ముందు, తర్వాత రక్త నమూనాలు సేకరించి సంబంధిత ల్యాబ్‌కు పంపిస్తామని సహాయ సంచాలకులు ఏడీడీఎల్ డాక్టర్ కరుణశ్రీ తెలిపారు. మండంలోని ఎర్రవల్లిలో పశువైద్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. సహాయ సంచాలకులు రక్త నమూనాలు సేకరించారు. 21 రోజుల తర్వాత మళ్లీ రక్త నమూనాలు సేకరించి సంబంధిత రిపోర్టులను మండల పశువైద్యాధికారులకు అందిస్తామన్నారు. వారి వెంట మండల పశువైద్య అధికారులు శివకుమార్, వీఎల్ఓ షేక్ మదర్, సిబ్బంది ఉన్నారు.

'దేవాలయాలపై దాడులు సరికాదు'

అచ్చంపేట రూరల్: హిందూ దేవాలయాలపై దాడులు చేస్తుంటే ప్రభుత్వం ప్రేక్షకపాత్ర వహించడం సరైందికాదని, శబరిమల అయ్యప్ప సేవా సమాజం జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మండికారి బాలాజీ అన్నారు. బుధవారం పట్టణంలోని అయ్యప్ప దేవాలయ ప్రాంగణం వద్ద హిందూ సంఘాల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ కొన్ని రోజుల నుంచి రాష్ట్రంలో హిందూ దేవాలయాలపై దాడులు జరుగుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో వెంకటేష్, మహేష్, రమేష్‌రావు, రమేష్, ప్రమోద్, ప్రసాద్, లక్ష్మణాచారి, శ్రీనివాసులు, రాజశేఖర్, లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.